క్లుప్తంగా

'రాజీవ్‌గాంధీ' కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద గల రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో బజాజ్ కేపిటల్ లిమిటెడ్ కంపెనీ శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ డాక్టరు ఎం.వెంకటరావు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు 120 మంది అభ్యర్థులు హాజరవ్వగా వీరిలో ఐదుగురు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో బజాజ్ కేపిటల్ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, కాకినాడ బ్రాంచ్ మేనేజర్ రాజేష్, రాజీవ్‌గాంధీ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి శశికిరణ్, ప్రిన్సిపాల్ రమేష్, కో ఆర్డినేటర్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లతో ప్రదర్శన చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ రూరల్: రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సర్పవరం జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు శుక్రవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఆటో యూనియన్ కార్యాలయం నుంచి జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై విజయబాబు మాట్లాడుతూ రహదారి భద్రత పాటించడంతో మనతో పాటు తోటి వారికి మంచి జరుగుతుందన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు, ఓనర్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న విశ్రాంత తహసీల్దార్ బాపిరాజు

కాకినాడ రూరల్: విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు శుక్రవారం స్థానిక సర్పవరం జంక్షన్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి నెలా పేదల కోసం ఏదో సేవ చేస్తూ ఆత్మ తృప్తి పొందుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డిసెంబర్‌లోగా ఇళ్లు నిర్మించండి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కాకినాడ రూరల్: జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వలసపాకల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి బీబీ అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పాటు ఉపాధి హామీ, డ్వాక్రా గ్రూపు మహిళలకు అందే అదనపు లబ్ధిని వివరించారు. లబ్ధిదారులు వేసవి లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కార్యదర్శి బీబీ వివరించారు. గృహ నిర్మాణాలకు అందే ప్రయోజనాలను వెలుగు ఏపీఎం వేదకుమారి డ్వాక్రా మహిళలకు వివరించారు. లబ్ధిదారుల సందేహాలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నివృత్తి చేశారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళులు



ఆళ్వార్‌దాస్‌కు నివాళులర్పిస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ వాకర్స్ సంఘ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ఎస్.ఆళ్వార్‌దాస్ వర్ధంతి సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ తదితరులు ఆళ్వార్‌దాస్‌కు నివాళులర్పించారు. 1986లో అంతర్జాతీయ వాకర్స్ సంఘాన్ని ప్రారంభించారని, ఇతర దేశాలలో కలిపి 1450 సంఘాలు ఏర్పడ్డాయన్నారు. 2003 జనవరి 20న ఆయన మరణించినట్టు చెప్పారు.

కెరీర్ గైడెన్స్‌పై రేపు కౌన్సెలింగ్

బోట్‌క్లబ్: కెరీర్ గైడెన్స్‌పై ఈ నెల 22న ఉదయం 10 గంటలకు దంటు కళాక్షేత్రంలో విద్యార్థులకు ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ప్రముఖ సైకాలజిస్ట్ జి.శశిభూషణ్ తెలిపారు. స్థానిక కరణంగారి సెంటర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు వారు స్థిరపడాలనుకున్న రంగాల్లో ఎలా ముందుకు వెళ్లాలో కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి సమితి ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు గుండ్రోజు ఉదయ భానోజీరావు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

- ఎంపీ వంగా గీత
- ఘనంగా వారోత్సవాల నిర్వహణ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు



రహదారి భద్రతా వారోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో శుక్రవారం 34వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆమె ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు ప్రారంభించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న పాల్గొన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ వాహనచోదకుల భద్రత, ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. సరైన అవగాహన లేక ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా త్వరలోనే ఈఎస్‌ఐ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు.

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, వాహనచోదకుల సంక్షేమం కోసం పథకాలు రూపొందించిన ఏకైక సీఎం జగన్ అన్నారు. పోలీసు, రవాణా శాఖాధికారులపై టార్గెట్ల కోసం ఒత్తిడి కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలను సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు.

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆటో డ్రైవర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని, వాహనమిత్రతో పాటు మరెన్నో పథకాలను రూపొందించి వారి జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని భవిష్యత్‌లో కూడా మరింత అండగా ఉంటుందన్నారు. జిల్లా రవాణా, పోలీసుశాఖ, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో రహదారి ప్రమాద సంఘటన దృశ్యాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్, ఆర్టీవో పీపీ సాయిప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, అపోలో ఆస్పత్రి వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిస్టర్ అక్కునగా అవినాష్



పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: పీఆర్ కళాశాల విద్యార్థి శివదుర్గ అవినాష్ అక్కు మిస్టర్ యూనివర్సిటీ టైటిల్ గెలుచుకున్నాడు. నన్నయ వర్సిటీ బెస్ట్ ఫిజిక్ పురుషుల పోటీలు స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని 15 కళాశాలల నుంచి 40 మంది హాజరయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మీడియా ఆఫీసర్ ప్రసాద్‌రాజు ప్రారంభించారు. విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు బహుమతులు అందజేశారు. కర్రి భామిరెడ్డి, సాయి, ఏలియా, కళాశాల పీడీ వర్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు
- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



లబ్ధిదారుకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 8వ డివిజన్ అయోధ్యనగర్ మూడవ వీధిలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. స్థానికులు పేర్కొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో స్వయంగా ప్రజల కష్టాలను చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల ద్వారా ప్రజల ప్రతీ కష్టాన్ని తీర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, సంగాని నందం, చిట్నీడి మూర్తి, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల సొంతింటికల సాకారమే ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- అరట్లకట్టలో గడప గడపకూ మన ప్రభుత్వం



అరట్లకట్టలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: పేదల సొంతింటికల సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్ 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం మండలంలోని అరట్లకట్టలో ఆయన స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ఎవరెవరికి లబ్ధి చేకూరిందో వివరించారు. అర్హులై ఉండీ పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు ప్రయోజనం పొందినట్టు లబ్ధిదారులు చెప్తుంటే సంతోషంగా ఉందన్నారు. వేలి ముద్ర పడక ఆరు నెలలుగా రేషన్ అందడం లేదని ఒక వృద్ధుడు చెప్పగా ఆయన సచివాలయ సిబ్బందిని పిలిపించి సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ కర్రె స్వప్నను ఆదేశించారు. పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా కామేశ్వరి తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాలు, సీసీ రోడ్డు నిర్మాణానికి కన్నబాబు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌లు పలివెల నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనుబాబు, దేగల లలితకుమారి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా జగన్ సర్కార్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన పసుపులేటి శ్రీనివాస్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ద్వారంపూడిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి ఆయనను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా సానుకూల దృక్పథంతో పనిచేసి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఉద్యోగులకు తానుకూడా పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

తాతయ్య సంవత్సరీకానికి వచ్చి తిరిగిరాని లోకాలకు




కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

కోటవురట్ల (అనకాపల్లి జిల్లా) : తాతయ్య సంవత్సరీకానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఓ బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి కన్నవారికి కన్నీటిని మిగిల్చాడు. యండపల్లి శివారున శివాలయం వద్ద ఆలయ ధర్మకర్త కుటుంబం నివసిస్తోంది. ఆలయ ధర్మకర్త శివరామశర్మ కొన్నాళ్ల క్రితం మరణించారు. ఆయన సంవత్సరీకం సందర్భంగా కాకినాడలో ఉంటున్న కుమార్తె లలిత, ఎల్ఐసీ ఏజెంట్ అయిన అల్లుడు వెంకటేశ్వరస్వామి తమ ఇద్దరు పిల్లలతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చారు. గురువారం కుటుంబ సభ్యులంతా కలిసి సంవత్సరీకం పూర్తి చేశారు. తిరిగి శుక్రవారం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంతలో శివరామశర్మ మనువడు గోపావఝుల నాగ భార్గవ రామశర్మ (16) వరాహనది వద్దకు వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో వెళ్లి చూసేసరికి నది ఒడ్డున చెప్పులు కనిపించాయి. ఆందోళనతో రామశర్మ మొబైల్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో నీటిలో ప్రమాదవశాత్తూ జారిపడి మునిగిపోయి ఉంటాడని గుర్తించి భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి నీటిలో వెతికినా ఫలితం లేకపోయింది. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ నారాయణరావు పరిశీలించి బి.కె.పల్లికి చెందిన నలుగురు గజ ఈతగాళ్లతో నదిలో వెతికించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు జానకమ్మ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గజ ఈతగాళ్లు కొద్ది సేపటికి రామశర్మ మృతదేహాన్ని గుర్తించి నదిలో నుంచి బయటకు తీశారు. శివయ్యా నా బిడ్డను బతికించు తండ్రీ అంటూ తండ్రి వెంకటేశ్వరస్వామి రోదించడం చూపరులకు కన్నీరు పెట్టించింది. తండ్రి వెంకటేశ్వరస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శ్రీరాంనగర్‌లో విషాదఛాయలు

కాకినాడ క్రైం: నగరంలోని శ్రీ రాంనగర్‌లో నివాసం ఉంటున్న 10వ తరగతి విద్యార్థి నాగభార్గవ రామశర్మ మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి. కాకినాడ శ్రీనగర్‌లో ఏఎఫ్‌సీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నేతల నూకరాజుకు ఫోన్‌లో తెలియపరచడంతో పాఠశాలలో విషాదఛాయలు అలముకున్నాయి. హెచ్ఎం నూకరాజు విద్యార్థులు, సిబ్బంది తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

భజన బృందాలకు సత్కారం



భజన బృందాలను సత్కరిస్తున్న దృశ్యం

కరప: మండలం కొంగోడులోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి భజన బృందాలను మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు ఆధ్వర్యంలో సత్కరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో సప్త సప్తాహాన్ని 11 భజన బృందాలతో నిర్వహించారు. భజన గురువు ఆచంట శ్రీను, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆట్ల గోవిందరాజు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ మేడిశెట్టి వీరభద్ర వెంకటరావు, అనసూరి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం లే అవుట్ పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఈ వీరేశ్వరరావు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం లే అవుట్‌ను హౌసింగ్ చీఫ్ ఇంజినీరు వీరేశ్వరప్రసాద్, హౌసింగ్ పీడీ పట్నాయక్ శుక్రవారం సందర్శించారు. లబ్ధిదారులతో వారు మాట్లాడారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ గుప్తా, ఏఈ నాగభూషణం తదితరులు లే అవుట్‌లో స్థలాలు, లబ్ధిదారుల వివరాలు తెలియజేశారు. గృహ నిర్మాణాలకు ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంటుందని, త్వరగా పూర్తి చేయాలని కోరారు.

23న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో 23వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. 9 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, యాక్సిస్ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ ఆఫీసర్, సెవెన్‌స్టార్ హాస్పటల్‌లో స్టాఫ్‌నర్సు, ఓపీ సర్వీస్, ల్యాబ్ టెక్నిషియన్, ఫ్రంట్ డెస్క్ ఆఫీసర్, హుండాయ్ మోబిస్‌లో టెక్నిషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్ నీడ్స్.కామ్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్, డ్రైవర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీడీ లచ్చారావు వివరించారు. అలాగే డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 40 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ. 20 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.

నేటి నుంచి విద్వత్సభ వార్షికోత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో శనివారం నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు సంగీత విద్వత్సభ 75 వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్టు సభ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ శుక్రవారం తెలిపారు. 21న సీత, నిత్యల భరత నాట్యం, 22న తోప్పూర్ సాయిరాం గాత్ర కచేరి, 23న సవిత శ్రీరాం గాత్ర కచేరి, 24న అనాహిత, అపూర్వల గాత్ర కచేరి, 25న బోనాల శంకర్ ప్రకాష్ వీణ సంగీత కచేరి నిర్వహించనున్నట్టు వక్కలంక తెలిపారు. అలాగే 26న భవ్యహరి గాత్ర కచేరి, 27న మధురై శివగణేష్ గాత్ర కచేరి, 28న టీఎస్ఎస్ కృష్ణ గాత్ర కచేరి, 29న వేదాంతం రామలింగశాస్త్రి నృత్యరూపకం, 30న విజయగోపాల్ వేణు గానామృతం సంగీత కచేరి నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

24న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 24న అపోలో ఫార్మసీ, జియో ఫైబర్ నందు పనిచేయడానికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శాంతి శుక్రవారం తెలిపారు. ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీలు 30మంది, జియో ఫైబర్ ఇంజినీర్ 50 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు, పదో తరగతి నుంచి అపైన డిగ్రీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 0884-2373270 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఎయిర్ కండిషన్‌పై ఉచిత శిక్షణ..

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 8వ తరగతి ఉత్తీర్ణులకు ఫీల్డ్ టెక్నీషియన్ అండ్ ఏసీలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు శుక్రవారం తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి కల్పిస్తామని, ఇతర వివరాలకు 99084 43770 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

కాండానికి అరటి గెల!



అరటిచెట్టు కాండం నుంచి చీల్చుకు వచ్చిన అరటిగెల

కరప: సాధారణంగా అరటిచెట్టుకు చివరలో ఆకుల మధ్య నుంచి అరటిగెల వస్తుంది. అయితే కరపలోని నక్కావారి ఎస్సీ వీధిలోని విశ్రాంత లైబ్రేరియన్ రాజాల బాగిరాజు ఇంటి పెరటిలో ఒక అరటిచెట్టు కాండాన్ని చీల్చుకుని అరటిగెల వచ్చింది. ఈ గెలలో పైభాగాన, అడుగుభాగాన ఉండే అరటికాయలు ఎదుగుతుండగా, మధ్యభాగంలోని కాయలు గిడసబారినట్టుగా కనబడుతున్నాయి. కాండంనుంచి వచ్చిన అరటిగెలను ఆప్రాంత ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 107 మంది ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఎంఎన్‌సీ యాక్సెంచర్ నిర్వహించిన కాంపస్ ఇంటర్వ్యూల్లో 107 మంది ఎంపికయ్యారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు శుక్రవారం తెలిపారు. డిగ్రీ విద్యార్హతతో సిస్టమ్ అండ్ అప్లికేషన్ సర్వీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ప్రారంభ వేతనం ఏడాదికి రూ.3.50 లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆ సంస్థ చైర్మన్ ఎస్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి అభినందించారు.

సెంటినరీ చర్చి నూతన కార్యవర్గం

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం చర్చిస్క్వేర్‌లోని సెంటినరీ ఆంధ్రా బాప్టిస్టు చర్చి కమిటీ అధ్యక్షుడిగా కె.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శిగా పి.స్వరాజ్‌రాయ్, కోశాధికారిగా పి.ధర్మారావు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి పాస్టర్‌గా ఎ.సుధాకరరావు నియమించినట్టు కమిటీ ప్రకటించింది.

నేడు యానాంరోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

కరప: చొల్లంగి అమావాస్య తీర్థంతో కాకినాడ–యానాం రోడ్డులో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కరప మండలం మొండి వద్ద శుక్రవారం బాలాత్రిపుర సుందరి సమేత సంగమేశ్వరస్వామి తీర్థం జరుగుతుండడంతో కాకినాడ నుంచి అమలాపురం వైపు, అమలాపురం నుంచి కాకినాడవైపు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్ 216 రహదారిలో మళ్లిస్తున్నట్టు తెలిపారు. కాకినాడ నుంచి అమలాపురం వైపు వెళ్లే వాహనాలు జగన్నాథపురం, అన్నమ్మఘాటీ సెంటర్, తూరంగి, నడకుదురు, గురజనాపల్లి, చొల్లంగి, చొల్లంగిపేట మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఎన్‌హెచ్ 216 చేరుకుని అక్కడ నుంచి అమలాపురం వైపు మళ్లిస్తున్నట్టు తెలిపారు. అలాగే అమలాపురం నుంచి కాకినాడ వైపు వచ్చే వాహనాలు పటవల వద్ద జాంకాయల తూము, జి.వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు, నడకుదురు, అన్నమ్మఘాటీ సెంటర్ మీదుగా కాకినాడ చేరుకుంటాయన్నారు. ఈ ట్రాఫిక్ మళ్లింపు శనివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమలులో ఉంటుందని అన్నారు. వాహనచోదకులు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ప్రశాంత జీవనానికి యోగా, పంచశీల



శిబిరంలో మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువు సుమేధా బోధి

కరప: ఆరోగ్య పరిరక్షణకు యోగా దోహదపడుతుందని, అలాగే ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆలోచనలతో పంచశీలను అనుసరించాలని ధర్మసైనిక్ కన్వీనర్, బౌద్ధభిక్షువు సుమేధాబోధి పేర్కొన్నారు. నడకుదురులో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పైలా గోవిందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమేధాబోధి మాట్లాడుతూ అహంకారాన్ని విడనాడి, నిబద్ధతతో, ఏకాగ్రతతో చేసిన ఏపనిలో నైనా విజయసాధిస్తారన్నారు. శిబిరాన్ని ప్రారంభించిన కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, యోగా గురువు పెంకే లోవరాజు యోగా విశిష్టతపై మాట్లాడారు.

జాతీయ పురస్కారానికి జీపీటీ విద్యార్థుల ఎంపిక

బాలాజీచెరువు: నాగపూర్ యూనివర్సిటీ నాగపూర్‌లో నిర్వహించిన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఐపీసీ-2023లో కాకినాడ మహిళా పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలకు చెందిన డీ-ఫార్మసీ విద్యార్థులు కేశవరపు సాయినిఖిత, 91శాతం, కంకటాల పద్మనాగహైమ 89 శాతం మార్కులతో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి కేకే ఆచార్జీ మెమోరియల్ ఇండియన్ ఫార్మాసిస్ట్ అవార్డు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్, ఫార్మసీ విభాగాధిపతి కిషోర్‌కుమార్ అభినందించారు.

పింఛనర్ల సంక్షేమ సంఘం ఎన్నిక



సంఘం కార్యవర్గ సభ్యులు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛనర్ల సంక్షేమ సంఘ సమావేశం జిల్లా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల పింఛనర్ల అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు అధ్యక్షతన కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా గట్టి రామారావు, జిల్లా అధ్యక్షుడిగా ఎం.సంజయ్‌శ్రీ, ప్రధాన కార్యదర్శిగా సలాది సాయి సత్యనారాయణ, కోశాధికారిగా వీజీ రామారావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గాన్ని గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు సంఘ జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి జయకృష్ణ, డిప్యూటీ లైబ్రేరియన్ ఆర్.వెంకటరాము, గాంధీనగర్ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.రెండు లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.జానకి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన కొవ్వూరి నారాయణ రెడ్డి నుంచి కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట చెందిన కేశవరపు సత్య శ్రీనివాస్ 2017లో రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2020లో రూ.2లక్షల చెక్కు ఇచ్చాడు.చెక్కును బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.2 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.